క్లుప్తంగా

నేడు సామూహిక అక్షరాభ్యాసం

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకొని బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వసంత పంచమికి ఆలయం ముస్తాబు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలోని సరస్వతి అమ్మవారి ఆలయం చుట్టు శివ స్వాములు వసంత పంచమి సందర్భంగా ముస్తాబు చేశారు. బుధవారం అక్షరాభ్యాసం ఉంటుందని ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి పేర్కొన్నారు.

ఎస్‌ఐలను సన్మానించిన నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, కోదండాపురం నూతన ఎస్‌ఐలు వెంకటేష్, రజితలను మంగళవారం వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు పీఎస్‌లలో కలిసి శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక

రాజోళి: సీఐటీయూ మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అధ్యక్షత నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల నూతన కన్వీనర్‌గా డీ లక్ష్మన్న, కో కన్వీనర్‌గా సుజాత, సభ్యులుగా జయంతి, సుజాత, విజయలక్ష్మి, సోలు రాజు, నర్సింహులు, తిక్కన్న, రాజేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నల్లగొండ సభకు బీఆర్‌ఎస్ నాయకులు



గద్వాల రూరల్: నల్లగొండలో మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నేతృత్వంలో గద్వాల బీఆర్‌ఎస్ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మంగళవారం వారు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలలో సభకు తరలివెళ్లారు.
కేటీదొడ్డి: నల్లగొండలో భారీ బహిరంగ సభకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీదొడ్డి మండల కేంద్రం, వివిధ గ్రా మాల నుంచి ప్రత్యేక బస్సులో బయలుదేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్ ఉన్నారు.
ధరూరు: నల్గొండలో మాజీ సీఎం కేసీఆర్ సభకు మండల నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మండల కేంద్రం నుంచి ప్రత్యేక బస్సులో మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి బయలు దేరి వెళ్లారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

అలంపూర్ రూరల్: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ (హరిజనవాడ) పాఠశాలకు దాతలు కుర్చీలను మంగళవారం వితరణ చేశారు. పాఠశాల జీహెచ్ఎమ్ గంటిపోగు నాగరాజు మాట్లాడుతూ దాతలు సహకరించి పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు హిమకుమార్ 6 కుర్చీలను, చి న్న మద్దిలేటి కుర్చీలను, జమ్మన్న రెండు కుర్చీలను పాఠశాలకు అందించారని జీహెచ్ఎమ్ తెలిపారు. కార్యక్రమంలో బైరోజ్ రాజశేఖర్, రాజశేఖర్, శ్రీధర్, శైలజ పాల్గొన్నారు.

వాటర్ క్యాన్ల అందజేత



రాజోళి: మండల కేంద్రంలోని కోటవీధిలో ప్రభుత్వ పాఠశాలకు పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాష్ వాటర్ క్యాన్లు, గ్లాసులను అందజేశారు. గతంలో ఇదే పాఠశాలలో తాను విద్యనభ్యసించినట్లు తెలిపారు. నాడు గురువులు చెప్పిన విద్యవల్లే నేడు మంచి స్థాయిలో ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమకు అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు. తాను చదివిన పాఠశాలకు తన వంతు సహాయం అందించడం తన అదృష్టమన్నారు. కార్యక్రమంలో సురేష్, గజేందర్‌రెడ్డి, మక్బుల్, శ్రీను, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాత భవనంలో పడిగాపులు

- కలుగోట్ల కస్తూర్బాలో పెండింగ్‌లో పనులు
- పూర్తికాని కరెంట్, నీటిఎద్దడి సమస్యలు
- ఆశగా ఎదురు చూస్తున్న కస్తూర్బా విద్యార్థినులు
- గతంలోనే శిలాఫలకం ప్రారంభించిన మంత్రి, ఎమ్మెల్యే



పాత భవనం ఇరుకుగదిలో వస్తువులతో పాటు విద్యార్థునుల చదువు



పాఠశాలలో కస్తూర్బా విద్యార్థినులు



కలుగోట్లలోని కస్తూర్బా పాఠశాల నూతన భవనం

ఉండవెల్లి: కలుగోట్ల కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు ఎదురు చూపులు తప్పడం లేదు. నూతన భవనం పూర్తయినా కొన్ని పనులు పూర్తికాకపోవడంతో ఆలస్యమవుతోంది. మండలానికి 2021లో కస్తూర్బా మంజూరు చేసి కలుగోట్లలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సొంత భవనం లేక అరకొర వసతులతో తాత్కాలిక భవనంలోనే నేటి వరకు కేజీబీవీ కొనసాగిస్తున్నారు. మండల కేంద్రం నుంచి కలుగోట్ల గ్రామానికి విద్యార్థుల తల్లితండ్రులు ప్రయాణించడానికి సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

చివరి దశలో పనులు

కలుగోట్ల గ్రామ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పనులు పూర్తియినట్లు ఉన్నతాధికారులు చెప్పడంతో గతంలో మంత్రి, ఎమ్మెల్యేలు శిలాఫలకాన్ని ప్రారంభించారు. 90 శాతానికి పైగా భవన నిర్మాణం పనులు పూర్తి కాగా, మిగిలిన పనులు చివరి దశలో ఉన్నాయి. త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. సొంతంగా నిర్మించిన భవనం అందుబాటులోకి వస్తే విద్యార్థినులకు సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి.

మేజర్ సమస్య కరెంట్..

నూతన భవనంలో మేజర్ సమస్య కరెంట్ త్రీ ఫేస్ లేకపోవడం. దీంతో విద్యార్థులకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. బోరు సౌకర్యం ఉన్నా 200 మందికి పైగా విద్యార్థినులకు నీటి ఇబ్బందులు ఎదుర్కోవల్సి ఉంటుంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. కులాయి ట్యాప్‌లు లూజ్ కనెక్షన్లు ఉన్నాయి. బిల్డింగ్‌లో వరండ తగ్గగా ఉంది. మిగితా చిన్నచిన్న సమస్యలున్నాయి. విద్యార్థినులు నూతన భవనంలోకి వెళ్లిన తరువాత పనులు పూర్తి చేయకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

పెండింగ్ పనులు అధికారులకు తెలిపాం..

కేజీబీవీ నూతన భవనంలో కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థినుల సంఖ్య పెరుగుతుండడంతో కొత్త భవనం ప్రారంభించాం. నూతన భవనంలో చిన్నచిన్న సమస్యలున్నాయి. వాటిని త్వరగా పూర్తి చేయిస్తాం. ఆ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– ఇందిర, జీసీడీఓ, గద్వాల్

విద్యుత్‌కు టెండర్ ప్రక్రియ పూర్తయింది

కలుగోట్ల కసూర్బా పాఠశాల నూతన భవనానికి విద్యుత్ ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. పంటలు ఉండడంతో పనులు పూర్తి కాలేదు. విద్యుత్ స్తంభాలు అమర్చాం. గ్రామంలో ఇతర పనుల వల్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

– చిన్న సయ్యద్ మగ్బుల్, విద్యుత్ ఏడీ

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు

గట్టు: సహకార కేంద్ర బ్యాంకు ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సహకార బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో సహకార కేంద్ర బ్యాంకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ పొదుపు ఖాతా ద్వారా ఖాతాదారులకు బీమా సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని, తీసుకు న్న రుణాలను సకాలంలో రెన్యూవల్ చేయించుకున్న రైతులకు 3 శాతం వడ్డీని వెనక్కి ఇస్తున్నట్లు తెలిపారు. విదేశాల్లో చదువుకునే వారికి ఎడ్యుకేషన్ లోన్ అందిస్తున్నట్లు తెలిపారు. సహకార కేంద్ర బ్యాంకులో అన్ని రకాల సేవలను ఖాతాదారులకు అందిస్తున్నట్లు మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీరాములు, పీఏసీఎస్ సీఈఓ నర్సింహులు, కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న డీసీపీఓ నర్సింహ



పెద్దపల్లిలో మాట్లాడుతున్న సీడీపీఓ కమలాదేవి

గద్వాల అర్బన్: 18 ఏళ్లు నిండని అమ్మాయిలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని డీసీపీఓ నర్సింహ అన్నారు. మంగళవారం గద్వాల మండలంలోని కొత్తపల్లి పాఠశాలలో, గ్రామసభ నిర్వహించి బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలపై వివక్ష, బాల కార్మిక వ్యవస్థ, సెల్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాలు తదితర విషయాలపై వివరించారు. ఎవరైనా బాలబాలికలు సమస్యలు ఎదుర్కొంటే వెంటనే 1098కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ హేమలత, పంచాయతీ సెక్రటరి, చైల్డ్‌లైన్ సిబ్బంది జయన్న, విద్యార్థులు ఉన్నారు.
మల్దకల్: గ్రామాల్లో 18ఏళ్లలోపు బాలికలకు బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సీడీపీఓ కమలాదేవి సూచించారు. మండలంలోని పెద్దపల్లిలో బాలల పరిరక్షణ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో బాలల పరిరక్షణ సమితి విభాగం కౌన్సిలర్ సురేష్, పంచాయతీ కార్యదర్శి హారిక, అంగన్‌వాడీ ప్రశాంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.
ఉండవెల్లి: బాలల హక్కుల గురించి ప్రతి విద్యార్థిని తెలుసుకుని ఉత్తమ స్థానాల్లో ఉండాలని ఎడీపీఓ సుజాత, ఎంపీపీ బీసమ్మ అన్నారు. తక్కశిలలో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు బాలల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మావతి, చైల్డ్ లైన్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
శాంతినగర్: మండంలోని తనగలలోని ప్రభుత్వ పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ సమావేశం నిర్వహించారు.
ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురం పాఠశాలలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి శివ హాజరై బాలల చట్టాలపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యురాలు లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, హెచ్ఎం ఖాన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వసతిగృహాల్లో మెనూ పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాసిరకం, చాలీచాలని భోజనం వడ్డిస్తున్నారని మండిపడ్డారు. మూడేళ్లుగా సంక్షేమ శాఖ అధికారులు వసతి గృహాలను పర్యవేక్షించకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వసతిగృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హనుమేష్, నరేష్, వీరేశఖర్, భీమేష్ ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



మానవపాడులో ఉపాధ్యాయులైన విద్యార్థులు

మానవపాడు: విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి స్వయం పరిపాలన దినోత్సవం మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్‌గా హారిక, ఎంఈఓగా ఆస్మా, జెడ్పీ చైర్మన్‌గా స ర్రీన్, ఆర్‌జేడీగా హీన, కలెక్టర్‌గా ఉమేహనితో పాటు 50 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. విద్యార్థులు ఆయా శాఖలో చ క్కగా నైపుణ్యం ప్రదర్శించారు. విద్యార్థి జీవితంలో మరుపురాని మ ధురానుభూతులని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు సుప్రభాతసేవ, తోమాల సేవ, బిందె సేవ, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి.

కబడ్డీ జట్టుకు డ్రెస్ అందజేత

కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నెలో కబడ్డీ జూనియర్ జట్టుకు మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడు డ్రెస్‌కోడ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో క్రీడాపోటీలు ప్రోత్సహించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, బహుదూర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, సిద్దప్ప, రుద్రప్ప వెంకటప్ప, లక్ష్మీరెడ్డి ఉన్నారు.

గుండ్ల భీమరాయస్వామి పల్లకీ సేవ

అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డిలో మంగళవారం గుండ్ల భీమరాయ స్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం అర్చకులు స్వామి వారి పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు రాత్రి ప్రభోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం రాత్రి స్వామివారి రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

అయిజ: మండల కేంద్రంలోని గుంతరామలింగేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. వేదపండితులు మంగళవారం ఆలయంలో ప్రాతకాల పూజ, యంత్ర, విగ్రహాలకు అభిషేకాలు, చండీ హోమం, రుద్ర హోమం, పూర్ణాహుతి, మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ, ప్రదోషకాల పూజ, హోమాలు, ధాన్యాదివాసం, శయ్యాదావాసం, పుష్పాదివాసం, మంగళ మారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించాలి

మల్దకల్: పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలని హెడ్మాస్టర్ నరేష్ సూచించారు. మంగళవారం మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి పరీక్షలు కీలకమని, తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయంలో నారా బ్రాహ్మణి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపురం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను మంగళవారం నారా బ్రాహ్మణి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఉభయ ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. ఈ సందర్భంగా నారా బ్రాహ్మణి మాట్లాడుతూ అలంపూర్ ఆలయాలతో నారా కుటుంబానికి మంచి అనుబంధం ఉందన్నారు. జోగుళాంబ అమ్మవారి పునఃనిర్మాణ విషయంలో, ఏపీ నుంచి పట్టు వస్త్రాల విషయంలో సేవ చేసుకునే భాగ్యం అమ్మవారు కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పురేందర్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆనంద్ శర్మ ఉన్నారు.

వైభవంగా అంజన్న బ్రహ్మోత్సవాలు



ఆంజనేయస్వామి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



అంజన్నకు తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



అంజన్న ప్రభోత్సవ కార్యక్రమం

ధరూరు: పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి బ్ర హ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ధ్వజారోహణంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉపనయనం, తెప్పోత్సవం, పల్లకీ సేవ, ప్రభోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం రాత్రి 10 గంటలకు రథో త్సవం ఉండడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దశమి కట్ట వరకు జరిగిన పల్లకీ సేవ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిట..

అంజన్న బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకటలాడుతోంది. స్వామి వారి కి దాసంగాలు (నైవేద్యం) పెట్టే వారు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు చేరుకున్నారు. తాగు నీరు, విద్యుత్ లైట్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించారు. అక్కడే వాహనాలు నిలిపేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. జాతర కు గద్వాల డిపో నుంచి ఆర్ టీసీ ప్రత్యేక బస్సులు నడపుతున్నారు.

16న సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జక్కుల వెంకటయ్య



మానవపాడులో పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

గద్వాల అర్బన్: రైతుల పోరాట ఫలితంగా మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తూ రైతులకు రాత పూర్వకంగా ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయలేదని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య మండిపడ్డారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న చేపట్టబోయే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని అలంపూర్, గద్వాల, శాంతినగర్, అయిజ కేంద్రాల్లోల ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వీవీ నర్సింహ, ఆశన్న, రైతాంగ సమితి నాయకులు సత్యారెడ్డి, తిప్పన్న ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ డిమాండ్ చేశారు. ఈనెల 16న జరిగే దేశ సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను జిల్లా కేంద్రంలోని వివిధ రంగాల కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు రాజేష్, మధ్యాహ్న భోజన కార్మికులు చాంద్ బాషా, రాజు, చెన్నమ్మ ఉన్నారు.
ఎర్రవల్లిచౌరస్తా: కేంద్ర ప్రభుత్వం కార్మికులు, కర్షకులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి ఆశన్న అన్నారు. మండలంలోని కొండేరులో హమాలీ కార్మికులతో కలిసి 16న సమ్మె వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అన్వేష్, పరశురాం, బీచుపల్లి, రమేష్, బాబు, శివన్న, చిన్న, కుర్మన్న, అంజి, మద్దిలేటి, జానకిరాముడు, ఈదన్న ఉన్నారు.
మానవపాడు: 16న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీఐటీయూ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కేంద్ర కార్మిక చట్టాలను మార్చి నష్టం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ మాలిక్ బాషా, కో కన్వీనర్ ఆదిలక్ష్మి, నీలమ్మ, ఈశ్వర్, రఫీ, లాలు, కృష్ణ, రాజు సభ్యులుగా ఎనుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మాలిక్‌బాషా పాల్గొన్నారు.

విద్యార్థినులకు మెటీరియల్ పంపిణీ



మెటీరియల్‌ను అందుకున్న విద్యార్థినులు

గద్వాల అర్బన్: హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రత్నసింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో టెన్త్ క్లాస్ విద్యార్థినులకు మెటీరియల్‌తో పాటు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తమ ట్రస్ట్ తరుపున తోడ్పాటు నందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు జహీరుద్దీన్ మాట్లాడుతూ జిల్లాలోని పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ వితరణ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కృష్ణ వర్ధన్‌రెడ్డి, అశోక్ కుమార్‌రెడ్డి, వెంకటేష్, నాగేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అసైన్డ్ భూములపై ఆరా



గట్టు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

గట్టు: అసైన్డ్ భూముల వివరాలను సేకరించే పనిలో రెవెన్యూ అధికారులు పడ్డారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రవి కుమార్, సీనియర్ అసిస్టెంట్ తిరుమలేష్, గిర్దావర్లు కరీం, శ్రీనివాసులు, సర్వేయర్ నర్సింహులు అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. 27 గ్రామ పంచాయతీలకు గాను 18 గ్రామ పంచాయతీల్లో అసైన్డ్ భూములు ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. ఇప్పటి దాకా 7 విడతల్లో లబ్ధిదారులకు అసైన్డ్ భూములకు సంబంధించి పట్టాలు అందజేశారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూముల వివరాలను కోరిన నేపథ్యంలో అసైన్డ్ భూముల వివరాలను సేకరించే పనిలో పడ్డారు. ఇప్పటికి మండలంలో ఎంత మంది లబ్ధిదారులకు అసైన్డ్ భూములను పంపిణీ చేశారు, గతంలో పంపిణీ చేసిన వాటిని రైతులు సాగు చేసుకుంటున్నారా? లేదా మిగులు భూములున్నాయా అనే విషయాలను క్షేత్ర స్థాయిలో పర్యటించి, విషయాలను తెలుసుకుని నివేదికను సిద్ధం చే స్తున్నారు. అసైన్డ్ భూముల సమగ్ర వివరాలను సేకరించే పనిలో రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు.

జేఈఈలో మెరిసిన ఎర్రవల్లి యువకుడు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన గోపి, రమాదేవి దంపతుల కుమారుడు జీవన్‌సాగర్ మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభను కనబర్చాడు. ఈ సందర్భంగా జేఈఈ 2024 సెషన్ 1 ఫలితాలలో 99.94 శాతం ఉత్తీర్ణతను సాధించాడు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభను కనబర్చిన యువకుడిని ప్రజాప్రతినిధులు, నాయకులు, అభినందించారు.